

11న అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కేంద్రంలోని వి.టి.అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 11న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి సొంటేన భీమశంకరరావు తెలిపారు. అప్రెంటీస్ మేళాలో రెడ్డీ ల్యాబ్స్, బెర్రీ ఎల్లాయిస్, మైలాన్, వరుణ్ మోటార్స్, ఐయోభేరి, జిందాల్ స్టీల్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్, శారద స్టీల్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటిఐ, ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటా, ఒరిజినల్ ధ్రువ పత్రాలు, ఆధార్, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 98491 18075, 98499 44654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోరులో అధినేత్రిగా.. ఊరిలో అధికారిగా..

పోరులో అధినేత్రిగా... ఊరిలో అధికారిగా అంటూ మహిళల బహుముఖ పాత్రను వివరించాడో రచయిత. 'ఎక్కడమ్మా.. నీవు లేనిది?, ఏమిటి నీవు చేయలేనిది?' అని కీర్తించాడో మరో కవి. ఇలా సమాజంలో సగభాగమై ముందుకు నడుస్తున్న మహిళలు ఓవైపు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూనే మరెంతో ముందుకు దూసుకుపోతున్నారు. డాక్టర్ నుంచి యాక్టర్ వరకు, కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు, పోలింగ్ నుంచి మేజర్ వరకు మహిళలు రాణిస్తున్నారు. మరోవైపు మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. నిత్యం ఏదో ఒకచోట మహిళలు అణచివేత, వేధింపులు, ప్రేమపేరిట దాడులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మహిళల వీరోచిత పోరాటాలను గుర్తుచేసుకుని, ఉన్నతమైన సమాజం వైపు ఆలోచింపజేసుకుంటూ ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు.

- అన్నింటా రాణిస్తున్న మహిళలు
- కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు
- యాక్టర్ నుంచి డాక్టర్ వరకు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం అంటే క్రీడా, కళా, సాంస్కృతిక రాజధాని. రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు తెచ్చుకుంటున్నారు. జిల్లా మనుగడలో వ్యవసాయ రంగానిదే కీలకపాత్ర. వీటన్నింటిలోనూ మహిళలదే ముఖ్యభూమిక. జిల్లా కలెక్టర్, ఎస్‌పి సహా ఎన్నో శాఖల్లో ఉద్యోగులు కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ మాటకొస్తే మన జిల్లా డిఆర్‌ఒ, ఆర్‌డిఒ, ఎఎస్‌పి మొదలుకుని ఎంతో మంది మహిళా అధికారులు ఉన్నారు. అటు విజయనగరం కార్పొరేషన్ మేయర్ మొదలు సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యుల్లో సగం మంది మహిళలే. ఓవైపు ఇంటిని చక్కబెడుతూనే ఎన్నికల్లో తాము సైతం అంటూ ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడుతున్నారు. అధికారులుగా ప్రభుత్వం తరపున సేవలందిస్తున్నారు.

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ప్రతి ఇంటిలోనూ శ్రామిక మహిళలు ఉన్నారు. క్వారీలు మొదలుకుని, వ్యవసాయం, నిర్మాణ రంగం తదితర రంగాల్లో కష్టపడి ఇంటిని నెట్టుకొస్తున్న మహిళలు అనేకం. చివరికి బండరాళ్లు మోసేవారిలోనూ మహిళలు భాగస్వామ్యమౌతున్నారు. ఇలా జీవన పోరాటంలోనూ, సమాజాభివృద్ధిలోనూ భాగస్వామ్యమౌతూనే తిరిగి ఇంటికి వెళ్లాక భార్యగా, అమ్మగా ఇల్లు చక్కబెడుతున్నారు. పురుషులతో సమానంగా పోటీ పడుతూ, కష్టపడుతున్నప్పటికీ పలు సందర్భాల్లో మహిళలు అన్నింటా అణచివేతకు, వివక్షతకు గురవుతున్నారు. నవమాసాలూ మోసి, పిల్లల్ని కని, తల్లిగా లాలిస్తూ పెద్ద చేస్తుంది. సోదరిగా ప్రేమానురాగాలను పంచుతుంది. భార్యగా జీవితంలో సగభాగమై ముందుకు సాగుతోంది.. ఉద్యోగిగా సమాజానికి తన వంతు సేవలందిస్తోంది. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులు ఎదురైనా పుట్టెడు సహనంతో ముందుకు సాగుతోంది.. తెరవెనుక మహిళల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పని ప్రదేశాల్లో, కార్యాలయాల్లో, ప్రయాణ సమయాల్లో వేధింపులు, వెక్కిరింపులు, ఇళ్లల్లో అణచివేత ఇలా ఎన్నో కష్టాలు ఎదురించి మరీ చెమట చుక్కలు చిందిస్తున్నారు.

ఇటుక బట్టీలో పనిచేస్తున్న శ్రామిక మహిళ

సృష్టికే మూలంగా ఉన్న మహిళ ఓవైపు అన్ని రంగాల్లో రాణిస్తుండగా, మరోవైపు అడుగడుగునా అణచివేతకు గురవుతోంది. పని ప్రదేశాల్లో మహిళలు ఆర్థిక, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. మరుగుదొడ్లు సైతం లేక ఆత్మగౌరవాన్ని చంపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా చెప్పాలంటే ప్రత్యేకించి మన రెండు జిల్లాల్లో మహిళలు పేరుకు ప్రజాప్రతినిధులుగా ఉన్నా, వారి అధికారాన్ని కుటుంబంలోని పురుషులే చెలాయిస్తున్నారు. వేధింపులు, అణచివేత నేపథ్యంలో ఆడపిల్లలంటే ఎంతోమంది భారంగా భావిస్తున్నారు. బహుశా అందుకేనేమో కొన్నేళ్లుగా జిల్లా జనాభాలో మహిళల సంఖ్య తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంతరాలు పోవాలంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు నిష్పక్షపాతంగా అమలు చేయాలి. ఈ పరిస్థితుల్లో ఆకాశంలో సగంగా ఉన్న మహిళ సగర్వంగా తలెత్తుకు తిరగాలని, భవిష్యత్తు మరింత దేదీప్యమానం కావాలని, అందుకు రాజ్యాంగ యంత్రాంగం సహకరించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

పోరాట చిహ్నమే మహిళా దినోత్సవం

కుట్టుపని చేసే శ్రామిక మహిళలు నిర్వహించిన వీరోచిత పోరాట సంప్రదాయాన్ని నిలబెట్టేందుకు ఏటా మార్చి ఎనిమిదో తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. అణచివేత, వివక్షతకు వ్యతిరేకిస్తూనే స్వేచ్ఛ, సమానత్వం కోసం నేటికీ మహిళలు పోరాడుతూనే ఉన్నారు. జాతి, మత, కుల, ఆర్థిక, సామాజిక వ్యత్యాసాల్ని పక్కనబెట్టి ఒకే వేదికపైకి చేరాల్సిన రోజు ఇది.

మధ్యాహ్న భోజన కార్మికులపై వైసిపి దాష్టీకం

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై వైసిపి నాయకులు దాష్టీకానికి తెగబడిన ఉదంతమిది. మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. 20 ఏళ్లుగా పని చేస్తున్న నిర్వాహకులపై వైసిపి నాయకులు దాడి చేయడంతో పాటు ఏకంగా అడ్డగోలుగా తొలగించారు. అధికార అండతో వైసిపి పెత్తనం చేస్తున్నా, ఇటు పోలీసులు, అటు విద్యాశాఖాధికారులు కిమ్మనకపోవడం గమనార్హం. దాడి జరిగి, జిల్లా కేంద్రాసుపత్రిలో ఎమ్మెల్సీ జరిగినా, పోలీసులు కేసు నమోదు చేయకుండా అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం బాధితులు ఎంఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, అధికారులకు వినతి పత్రం అందజేశారు.



తొలగించారని ఆవేదన చెందుతున్న ఎండిఎం కార్మికులు

- దాడి చేసి మరీ... ఏజెన్సీ నుంచి తొలగింపు
- ఫిర్యాదు చేసి వారం గడిచినా పట్టించుకోని పోలీసులు
- అధికార పక్షానికి కొమ్ముకాస్తున్న అధికారులు

ప్రజాశక్తి - జామి

మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో మోసాడ లక్ష్మి, ఎన్నింటి లక్ష్మి.. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వాహకులుగా పని చేస్తున్నారు. అయితే గత వేసవి సెలవుల్లో ఎన్నింటి లక్ష్మి చనిపోవడంతో ఆ స్థానంలో ఎన్నింటి సుజాతను నియమించారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత తాలాడ పైడిరాజు అనే మరో మహిళను నియమించారు. అప్పటి నుంచి ఏదో విధంగా ముందు నుంచీ ఉన్న నిర్వాహకులను తొలగించాలని వైసిపి పన్నాగం పన్నుతూ వచ్చింది. చివరికి గత నెల 29న మోసాడ లక్ష్మి, పైడిరాజు మధ్య చిన్న తగాదా చోటుచేసుకుంది. దీంతో పైడిరాజు భర్త ఆ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌గా ఉండడంతో దౌర్జన్యంగా మరో వ్యక్తితో కలిసి పాఠశాలలోకి నేరుగా వచ్చి, మహిళ అని చూడకుండా దాడికి తెగబడిన ఘటన అందరినీ కలచివేసింది. దీంతో మోసాడ లక్ష్మి 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రిలో చేరి, వైద్యం తీసుకుని పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. 100కు డయల్ చేసి పోలీసులకు తమపై జరిగిన దాడిని వివరించారు. ఆస్పత్రి నుంచి వచ్చి పోలీసులను నేరుగా కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదూ అందజేశారు. కానీ అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

పొట్ట మీద కొట్టారు

దాడి చేయడంతో ఆగని అధికార పార్టీ నాయకులు వారిని ఏకంగా విధుల నుంచి తొలగించించారు. ఇక నుంచి పాఠశాలకు రావద్దని చెప్పినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు అధికారపార్టీతో కుమ్మక్కై, తమను అన్యాయంగా తొలగింపు చర్యలకు దిగడం ఎంతవరకు సబబని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తొలగింపు చర్యలు ఆపడంతోపాటు తమపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుపేదలమైన తమపై అధికార పార్టీ పెద్దలు ఇంతటి దాష్టీకానికి దిగడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

తొలగింపు విషయం తెలియదు

మధ్యాహ్న భోజన ఏజెన్సీ వివాదంపై ఇరువురికి సర్ది చెప్పాం. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. కమిటీ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు నిర్వాహకులను తొలగించిన విషయం తెలియదు.

- గంగరాజు, ఎంఇఒ- 2, జామి

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రతిపాదనలు సమర్పించాలి

విజయనగరం : జర్నలిస్టులలకు ఇళ్ల స్థలాల మంజూరుకు అవసరమైన స్థలాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్.. ఆర్‌డిఒలను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని ఆర్‌డిఒలు, డిపిఆర్‌ఒతో జెసి టెలికాన్ఫరెన్సు ద్వారా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై ఆయా డివిజన్లలోని పరిస్థితిని సమీక్షించారు. ఇళ్లస్థలాల కోసం 369 దరఖాస్తులు అందాయని, వాటిని అన్ని మండలాల తహశీల్దార్లకు కలెక్టర్ కార్యాలయం ద్వారా పంపించామని డిపిఆర్‌ఒ డి.రమేష్ వివరించారు. ఈ జాబితాలో అర్హులను గుర్తించే ప్రక్రియను పూర్తిచేసి, కేటాయించేందుకు ప్రభుత్వ భూమి లభ్యత ఉన్నచోట తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని జెసి తెలిపారు.

బిసిలకు రక్షణగా నిలుస్తాం

టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగు రాష్ట్రాల్లో బిసిలకు న్యాయం చేసింది, రక్షణగా నిలిచింది టిడిపి మాత్రమేనని ఆ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూసపాటి అదితి గజపతి రాజు తెలిపారు. స్థానిక అశోక్ బంగ్లాలో గురువారం బిసి డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం తర్వాత గణనీయంగా మార్పులు వచ్చాయని గుర్తు చేశారు. ఎంతోమంది బిసిలను రాజకీయాల్లోకి తీసుకొచ్చి పదవులు ఇచ్చారన్నారు. బిసిల సంక్షేమం టిడిపితోనే సాధ్యమైందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అవ్వాలని 2019 ఎన్నికలకు ముందు బిసిలకు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కార్పొరేషన్లు పెట్టి బిసిలకు ఏమైనా నిధులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. వెనుకబడిన వర్గాలకు ఇవ్వాల్సిన సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని తెలిపారు. బిసిలపై దాడులు జరుగుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ నాయకులు కె.అప్పారావు నాయకత్వంలో నాయీబ్రాహ్మణులు అదితిని కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, కనకల మురళిమోహనరావు, కంది మురళినాయుడు, కొండ్రు శ్రీను, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పనిప్రాంతంలో భద్రత అవసరం

మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహిళలు అనేక రంగాల్లో ఉద్యోగులుగా ఉంటూ ఆర్థిక పరమైన స్వేచ్ఛను కలిగి ఉన్నారని, అయితే పనిచేసే చోట భద్రత కూడా అవసరమేనని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభిప్రాయ పడ్డారు. మహిళల భద్రత కోసం కార్యాలయాల్లో అంతర్గత కమిటీలను నియమించాలని చెప్పారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ముందస్తుగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, ముఖ్యంగా ప్రస్తుతం జిల్లాలో పాలనాపరంగా కీలక పదవులు నిర్వహిస్తున్న అధికారులంతా మహిళలేనని చెప్పారు. మహిళలకు, పురుషులకు జెండర్ పరంగా వేర్వేరు పనులు ఉండవని, ఉద్యోగంలో అందరూ సమానమేనని తెలిపారు. ఆడ, మగా సమానమేనని భావన తల్లిదండ్రుల్లో కలగాలని, అప్పుడే సమాజంలో లింగ వివక్ష పోతుందని అభిప్రాయపడ్డారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ హిమ బిందు, జిల్లా పరిషత్తు ఐదో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతకుమారి, జిల్లా ఆడిట్ అధికారి అరుణ కుమారి, ఎపిజిఎల్‌ఐ అధికారి హైమావతి, మత్స్య శాఖ అధికారి నిర్మలకుమారి, డివిజినల్ పిఆర్‌ఒ జానకమ్మ తదితరులు మహిళల స్థితిగతులు, స్త్రీల ఔన్నత్యం పై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను, వాణిజ్య, వ్యవసాయ, క్రీడలు, సేవా, చేనేత తదితర రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను కలెక్టర్ సన్మానించారు.

జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఆర్‌టిసి డిపోలో.. స్థానిక ఆర్‌టిసి డిపోలో డిపిటిఒ అప్పలనారాయణ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిం చారు. సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ హిమబిందు, డిప్యూటీ సిఎంఇ కె.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఎటిఎం సిహెచ్.దివ్య పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది శక్తివంతంగా మారాలని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. మహిళా పార్కులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలు భారీ ర్యాలీ చేపట్టారు. మానవహారంగా ఏర్పడి మహిళా శక్తిని ప్రతిబింబించే విధంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.కళావతి పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు నేడు సత్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్వగృహంలో మహిళా కార్మికులకు సత్కారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి వెల్లడించారు.

మాట్లాడుతున్న డిపిటిఒ అప్పలనారాయణ

1.43 లక్షల మందికి చేయూత

విజయనగరం : జిల్లాలో 1.43 లక్షల మందికి చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలోని 45-60 ఏళ్ల వయస్సు గల మహిళలకు వైఎస్‌ఆర్ చేయూత పథకం కింద నాలుగో విడత ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గురువారం ఆన్‌లైన్ ద్వారా అనకాపల్లి నుంచి విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు మహిళలకు నాలుగో విడత ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. జిల్లాలో నాలుగో విడతలో ఒక్కో మహిళకు రూ.18,750 చొప్పున 1,43,280 మందికి రూ.268.65 కోట్లు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కో మహిళకు నాలుగు విడతల్లో రూ.75 వేలు సాయం అందించామన్నారు. జిల్లాలో నాలుగు విడతల్లో ఇప్పటి వరకు రూ.1,002.92 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. జిల్లాలో చేయూత పథకం కింద పొందిన ఆర్థిక సహాయంతో 74,111 యూనిట్లు ఏర్పాటయ్యాయని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ త్వైకాండో పోటీలకు హిమశ్రీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయస్థాయి త్వైకాండో పోటీలకు నగరానికి చెందిన వి.హిమశ్రీ ఎంపిక కావడం గర్వంగా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్వగృహంలో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 9 నుంచి కటక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో హిమశ్రీ పాల్గొననున్నట్లు త్వైకాండో చీఫ్ కోచ్ డి.వి.చారి తెలిపారు. గతంలో మూడుసార్లు జాతీయ పోటీలలో హిమశ్రీ పతకాలను సాధించిందని గుర్తు చేశారు.

ఉద్యాన అధికారిగా ఉమా భరణి

నగరపాలక సంస్థ ఉద్యాన శాఖాధికారిగా బి.ఉమాభరణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం కమిషనర్ ఎం.ఎం.నాయుడును కలిసి జాయినింగ్ రిపోర్టును అందించారు. ఉద్యాన శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఉమాభరణిని కమిషనర్ అభినందించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఉద్యాన శాఖ అధికారిగా సేవలందించి బదిలీపై నగరానికి ఆమె వచ్చారు. ప్రధానంగా నగర సుందరీకరణ, ల్యాండ్ స్కేపింగ్, అర్బన్ గ్రీనింగ్ వంటి సేవలను ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆమె తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 20,344 మంది హాజరు

జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ పరీక్షకు 20,344 మంది విద్యార్థులు హాజరయ్యారు. 21564 మందికి గాను 1220 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష జరిగిందని చెప్పారు.

వైసిపిలో చేరికలు

నగరంలోని ఐదో డివిజన్‌లో టిడిపికి చెందిన 36 కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వగృహంలో ఆయన సమక్షంలో వారంతా వైసిపిలో చేరారు. నైదాన శ్రీనివాసరావు నేతృత్వంలో చేరిన వారికి వైసిపి కండువాలు వేసిన కోలగట్ల పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మన్యాల కృష్ణ, బొద్దాన అప్పారావు, గదుల సత్యలత, కార్పొరేటర్ గాదం మురళి, పొంతపల్లి మాలతి, గువ్వల తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా బాధ్యత కీలకం

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల నిర్వహణలో సిబ్బంది, అధికారులతో సమానంగా మీడియాకు బాధ్యత ఉంటుందని, వచ్చే ఎన్నికలను విజయవంతంగా నిర్వహించ డంలో సహకరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎన్నికల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరగడానికి తీసుకున్న ఏర్పాట్లపై వివరించారు. ఎన్నికలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పాత్రికేయులు వాస్తవమైన సమాచారంతో కూడిన రిపోర్టింగ్ చేయాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం మతం, కులం, జాతి లేదా భాష ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాన్ని పెంచే వార్తలను రిపోర్టింగ్ చేయకూడదని స్పష్టం చేశారు.

పాత్రికేయుల ఇళ్ల స్థలాలపై దృష్టి

పాత్రికేయులకు ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల స్థలాలపై కోడ్ వచ్చే లోపలే పరిష్కరించాలని పాత్రికేయులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉన్నదీ గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే స్థలాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని జెసి కార్తీక్‌కు సూచించారు. సమావేశం లో మెప్మా పీడీ సుధాకర రావు ఎన్నికల ప్రక్రియ పై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. డిఆర్‌ఒ ఎస్.డి అనిత, డిఐపిఆర్‌ఒ డి.రమేష్, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ ప్రభాకర రావు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



పతకాలు సాధించిన క్రీడాకారులతో కేసలి అప్పారావు, త్రివినాగ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, అసిస్టెంట్ కలెక్టర్ బి.ఎస్. వెంకట్ త్రివినాగ్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే డు ఛాంపియన్‌షిప్-2024లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటి పతకాలు సాధించారు. వీరికి ఎ.బి చారిటబుల్ ట్రస్ట్, జైహనుమాన్ అశ్విని మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అకాడమీ, సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ప్రదీప్ నగర్‌లోని కరాటే అకాడమీలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎబి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం. ఎస్ స్వరూప్ సుమన్ షాతోకన్ పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-గరివిడి

గరివిడి మండలం దువ్వాం గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, దేవాడ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్లను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, ఆర్‌డిఒ బి.శాంతి, ఎంపిపి మీసాల విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, బొత్స సందీప్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రిబ్బన్ కట్ చేసి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స

జొన్నవలసలో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి-విజయనగరం కోట :

మండలంలోని జొన్నవలస గ్రామంలో విజయనగరం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవ్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని సిఐ శ్రీనివాసరావు కోరారు. అసాంఘిక శక్తులకు సహకరించ వద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

మున్సిపల్ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి

విజయనగరం టౌన్ : నగరంలోని 13వ డివిజన్ పరిధిలో ఉన్న సాకేటివీధి మున్సిపల్ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని వైసిపి పార్లమెంటరీ కార్యదర్శి ముద్దాడ మధు అధికారులను కోరారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల ఐదేళ్లుగా అభివృద్ధికి నోచలేదని, ఎన్నిసార్లు అధికారులకు వినతులిచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో చేర్చక పోవడంతో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

లెండిలో ఘనంగా ముగిసిన 'లక్ష్య'

డెంకాడ: లెండి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఘనంగా ప్రారంభమైన ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థి సంఘ వార్షికోత్సవం లక్ష్య 2024 రెండో రోజు గురువారం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా ముగిసింది. ముందు రోజు జరిగిన సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన, రోబో రేస్, రోబో వార్‌లలో, పలు క్రీడలలో అద్భుతమైన ప్రదర్శన చేసిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ బహుమతులను ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామా రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బరామయ్య ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ విభాగపు వార్షిక సంచిక 'లక్ష్య 2024'ను ఆవిష్కరించారు. ఈ కళాశాల డిపార్ట్మెంట్ పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఇన్‌వేసేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫిజికల్ డిజైన్ ఇంజనీర్‌గా పని చేస్తున్న చిన్ని బాబా మాట్లాడుతూ రాబోయే కాలంలో భారత దేశం ప్రపంచ ఆర్థిక వనరుగా మారబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.వి.ఎస్. ఆచార్యులు, పి. జానకి, టి.పాపి నాయుడు, రవిశంకర్, కె.ప్రవీణ్ కుమార్ విద్యార్థులు సుమంత్, పి.మనోహర్, పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

వంగర: మండలంలోని సంగాలో గల సంగమేశ్వర ఆలయం వద్ద శుక్రవారం నుంచి వారం రోజులు పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ట్రైనీ డిఎస్‌పి ఎస్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన సంగాంలో గురువారం పర్యటించారు. విధులు నిర్వహించనున్న పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. షిఫ్టులు వారీగా విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్, వంగర ఎస్ఐ వై జనార్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వేపాడ: మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో గురువారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక వైద్యాధికారిణి ఏ ధరణి 36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం బాణాది గ్రామం శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష పై అవగాహన కల్పించాలి

నెల్లిమర్ల: లింగ వివక్షపై డ్వాక్రా సంఘాలు మరింత అవగాహన కల్పించాలని డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి అన్నారు. గురువారం వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో విఒఎలకు జెండర్ పై గత మూడు రోజులుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ, మగ తేడా లేకుండా ఇద్దరని సమానంగా చూసి ఆడ పిల్లల పట్ల వివక్ష చూపించరాదన్నారు. బాల్య వివాహాలు జరగకుండా మధ్యలో చదువు ఆపేసిన ఆడ పిల్లలను గుర్తించి వారి కుటుంబాలకు అవగాహన కల్పించి తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ బి.బంగారమ్మ, జిల్లా జెండర్ రిసోర్స్ పెర్సన్ కె.గీత, పి. గురుమూర్తి, ఎపిఎంఎల్. సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, మహిళా దినోత్సవాలను ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 10వతరగతి విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి అనుకున్న లక్ష్యం కోసం బాటలు వేసుకోవటానికి ఇదే సరైన సమయమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేశారు. ప్రీ ఫైనల్ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

కొత్తవలస: మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ సేవాసమితి ట్రస్టు అండ్ ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోళ్లలలిత కుమారి ఆధ్వర్యంలో విశాఖ గీతం దంత వైద్య కళాశాల అండ్ ఆసుపత్రి, జిమ్‌సర్ ఆస్పత్రి వైద్యులు గురువారం ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, బొబ్బిలి అప్పారావు మాస్టర్, కోళ్ల వెంకటరమణ (శ్రీను), బంగారు రమేష్, కనకాల శివ, లాలం అర్జునరావు, లెంక శ్రీను, కొరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

బొబ్బిలి: స్థానిక కోర్టులో శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ఈనెల 16కు వాయిదా వేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సెలవు, మహాశివరాత్రి కంటిన్యూ సెలవుగా పరిగణించి లోక్ అదాలత్ వాయిదా వేశామన్నారు. లోక్ అదాలత్ వాయిదాను గమనించాలని కోరారు.

పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంటలో పశువైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన పశుగర్భకోశ వ్యాధుల వైద్య శిబిరాన్ని గురువారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. అనంతరం గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన లేగ దూడలు ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. మేలు జాతి ఆడ దూడలు ఉత్పత్తి పెంచడం ద్వారా రైతన్నలకు పాల ఉత్పత్తి పెరిగి ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, ఎంపిటిసి కర్రి చిన్నం నాయుడు, బాడంగి జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, పశువైద్యాధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి పని చేయాలి

బొబ్బిలి: నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి పని చేయాలని నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. ఇందిరమ్మ కాలనీలో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు పని చేయాలన్నారు. టిడిపి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామ్మోహన్, సాయిరమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు

బొబ్బిలిరూరల్ : మండలంలోని తాగు నీటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి శంబంగి లక్ష్మీ, వైసిపి నాయకులు వేణుగోపాల్ నాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాష్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బోర్లు పని చేసేవిధంగా మరమ్మత్తులు చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్, ఆర్.డబ్ల్యుఎస్ ఎఇ శ్రావణ్‌కుమార్, ఇఒపిఆర్‌డి ఏ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ

రేగిడి: మండలంలోని అంబకండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ సీనియర్ ఎవిపి పట్టాభి రామ్‌రెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ గురువారం పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని వెల్లడించారు. తరగతి గదిలో పరీక్ష పేపర్ ఇచ్చే ముందు ప్రశ్న పత్రాలను రెండుసార్లు చదివితే వాటికి సంబంధించిన జవాబులు అర్థమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, హిందీ ఉపాధ్యాయులు మజ్జి గణపతి రావు, కర్మాగార హెచ్‌ఒడబ్ల్యు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధిస్తే ప్రోత్సహకాలు

గరివిడి: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు 3వేలు, తృతీయ స్థానం పొందిన వారికి 2వేలు బహుమతులుగా ఇచ్చి ప్రోత్సహకం అందిస్తామని పిఎసిఎస్ అధ్యక్షులు యడ్ల అప్పారావు అన్నారు. మండలంలోని తాటిగూడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ వల్లూరు గౌరి నాయుడు, వైస్ ఛైర్మన్ అంపోలు రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

గంట్యాడ: ఈ నెల 13న కెపిఎన్ బిఇడి కళాశాలలో జరగనున్న టిడిపి మండల సమావేశాన్ని విజయవంతం చేయాలని టిడిపి నాయకులు కొండపల్లి భాస్కర నాయుడు, రొంగలి కృష్ణ, అల్లు విజయ్, బూడి అప్పలనాయుడు, రంది చినరామునాయుడు కోరారు. గురువారం కెపిఎన్ బిఇడి కళాశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బిసి డిక్లరేషన్‌లో పథకాలు ప్రకటించడం ఆనందంగా ఉందని ధన్యవాదాలు తెలిపారు. ప్రతి గ్రామం నుండి సమావేశానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలు: ఐద్వా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నో త్యాగాలతో, ఎన్నో పోరాటాలతో శ్రామిక మహిళలు సాధించుకున్న అనేక హక్కులపై నేడు ప్రపంచ వ్యాప్తంగా దాడి జరుగుతోందని జెవివి సమతా విభాగం రాష్ట్ర కన్వీనర్ జి. నిర్మల, ఐద్వా నగర అధ్యక్షులు కరుణ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని రామకృష్ణ నగర్‌లో జరిగిన సభలో వారు మాట్లాడారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడినట్టైందన్నారు. దాడులు, అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. చట్టాలు ఎన్ని తీసుకొచ్చినా పటిష్టంగా అమలు కావడం లేదని చెప్పారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే మనముందున్న ఏకైక మార్గమన్నారు. ఆ దిశగా మహిళల్లో చైతన్యం, విజ్ఞానం పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. ఐద్వా జిల్లా కోశాధికారి ఎం.జగదాంబ అధ్యక్షతన జరిగిన సభలో మహిళలు పాల్గొన్నారు.

బొండపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో పెంట కుమారి అధ్యక్షతన గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సౌమ్య మాట్లాడుతూ 1885లో అమెరికా న్యూయార్క్ నగరంలోని బట్టల మిల్లులో పనిచేసే మహిళా కార్మికులు సమ్మె చేస్తే సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఆనాటి పాలకులు వారి మీద కాల్పులు జరిపారని గుర్తు చేశారు. దీనిపై పోరాటం చేసి సాధించుకున్న హక్కుల ఫలితంగా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక

నినాదాలు చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

మహిళా జిల్లా కన్వీనర్ వీ లక్ష్మీ, ఏ పార్వతి, టి.కనకమహాలక్ష్మి, కె.విజయ, కె.సత్యవతి, జి. ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండల కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ హరికృష్ణవేణి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సౌమ్య, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షులు ఎం సుభాషిని, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: యుటిఎఫ్, సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సిఐటియు నాయకులు కామేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ మహిళల హక్కులు కోసం, సౌకర్యాల కోసం, ఓటు హక్కు కోసం, వేతనాల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి సాధించుకున్న విజయానికి ప్రతిరూపం అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి, రోజా, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, సిఐటియు నాయకులు సురేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నెల్లిమర్ల: నగర పంచాయతీలో మహిళా దినోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో అంగన్ వాడి టీచర్స్, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మెప్మా ఆర్‌పిలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లుతో బైరెడ్డి సూర్యనారాయణ కళ్యాణ మండపంలో సభ నిర్వహించారు. నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో నిలుస్తున్నారన్నారు. అనంతరం కళ్యాణ మండపం నుండి రామతీర్థం జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనరు పి.బాలాజీ ప్రసాద్, ఎలక్షన్ డి టివిఎస్ఎన్ మూర్తి, మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, ఆర్ఐ ఎ. రాజ్యలక్ష్మి, మెప్మా సిఎంఎం డి.గోవిందరావు, సిఒ పోలి నాయుడు, టిఎల్ఎఫ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : అయ్యన్నపేట జంక్షన్లో ఉన్న మదర్ థెరిసా కిడ్స్ స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదతాడివాడ హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ పి.మాలతిని సన్మానించారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు శ్రీనివాస్, శ్రావణి, సుజాత, హైమ, కాంచన పాల్గొన్నారు.

మున్సిపల్ అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- బొబ్బిలి

తాగునీటి సరఫరా విభాగంలో జరుగుతున్న అవినీతిని నివారించాలని, అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని టిడిపి కౌన్సిలర్ శరత్ డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ వాటర్ వర్క్స్‌కు నిధులు కేటాయిస్తున్నా తాగునీటిని సరఫరా చేయడంలో విఫలమవుతున్నారన్నారు. అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండడం లేదన్నారు. తాగునీటి సరఫరా విభాగానికి కౌన్సిలర్లతో కమిటీ వేయాలని వైసిపి కౌన్సిలర్ గోవింద్ కోరారు. వాటర్ వర్క్స్‌లో అవినీతి జరగలేదని చైర్మన్ మురళి అన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులకు అద్దె చెల్లించని షాపులకు తాళాలు వేసి కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి, వైసిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. టిడిపి కౌన్సిలర్లు రాంబర్కి శరత్, గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ షాపులు అద్దెలు వసూళ్లకు ఎందుకు

సెల్‌ఫోన్‌లో అభివృద్ధి పనుల్లో నాణ్యత లేదని చూపిస్తున్న శరత్

చొరవ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కుళాయి పన్ను చెల్లించకపోతే కుళాయి కనెక్షన్ కట్ చేస్తున్న అధికారులు షాపులకు ఎందుకు తాళాలు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపులు అద్దె చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, పాలవలస ఉమా, బొత్స రమణమ్మ కూడా డిమాండ్ చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ షాపులు పూర్తి సమాచారం తర్వాత సమావేశంలో కౌన్సిల్ సభ్యులకు వివరించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. వార్డులలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీర్మానం చేశారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేయాలి

మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు కోరారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లేదని ప్రతి పక్షాలు ఆరోపిస్తున్నాయని, అభివృద్ధి పనులను పర్యవేక్షించి నాణ్యత పాటించాలని సూచించారు. తాగునీరు సంపూర్ణంగా సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా పని చేయడం లేదన్నారు. అవినీతికి ఎవరు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐదేళ్లలో అభివృద్ధి చేశామని, రానున్న ఎన్నికల్లో ఓటు వేసి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

శృంగవరపుకోట: దక్షిణ కాశీగా పిలవబడే పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయం, మండలంలోని ధర్మవరం వద్ద గల సన్యాసేస్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లను చేసామని ఆలయ కార్యనిర్వాహణాధికారులు నాగేంద్ర, ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పుణ్యగిరిలో ఉన్న శివాలయానికి, ధ్వజ స్తంభానికి, భారీకేడ్లను రంగులు వేయించామన్నారు. దారి పొడవునా మూడు కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరు చోట్ల సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ఏడాది డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు. మూడు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని 300 మంది పోలీస్ సిబ్బందిని ఆరు చోట్ల విహెచ్‌ఎఫ్ సర్కిల్ ఏర్పాటు చేసి వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. ఎస్‌కోట నుంచి పుణ్యగిరికి, సన్యాసేస్వర దేవాలయానికి బస్సును ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఉరేసుకుని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి- మెంటాడ

నాలుగు రోజులుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గిరిజనుల రిలే నిరాహార దీక్షల్లో గురువారం వినూత్నంగా గిరిజనులు మెడకు ఉరేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ గిరిజన నిరుపేదలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్య వైఖరి అమానుషమన్నారు. ఎన్నోఏళ్లుగా సాగుచేస్తున్న గిరిజన, దళిత నిరుపేదలకు భూహక్కుల చట్టం ప్రకారం సర్వే నిర్వహించి అర్హత వున్న వారికి పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సర్వే చేయాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదేశాలు జారీచేసినప్పటికీ 1000 మంది లబ్ధిదారులకు కేవలం 600 మందికి మాత్రమే సర్వే చేశారన్నారు. దీనిపై మళ్లీ డిప్యూటీ సిఎంను కలిస్తే ఆయన తిరస్కరించడం సబబు కాదన్నారు. లోతుగెడ్డ పంచాయతీ నిక్కలవలస రెవెన్యూ పరిధిలో తాత ముత్తాతలు నుంచి సాగుచేస్తున్న గిరిజన బిడ్డలను బెదిరించి సుమారుగా రెండువందల ఎకరాల్లో నీలగిరి మొక్కలు పెంచి ఇటీవలే కోత చేస్తూ బడా భూస్వామి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైన ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామారాపల్లి సోములు, బంగారి సింహాచలం, శివ, లక్ష్మణరావు, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక విపత్తుపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జిల్లాలోని పారిశ్రామిక వాడగా పిలువబడుతున్న పూసపాటిరేగ మండలంలో బుధవారం రసాయినిక విపత్తుపై జిల్లా అధికార బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ డ్రిల్‌లో 24 డిపార్ట్‌మెంటులు పాల్గొన్నాయి. మాక్ డ్రిల్ ఇలా ప్రారంభమైంది... ఉదయం 9:51 నిమిషాలకు మైలాన్ కెమికల్ పరిశ్రమ నుండి ప్రమాదం సూచించే అలారం మోగింది. పరిశ్రమలో అన్ లోడ్‌చేస్తున్న లారీ ట్యాంకర్ లీక్ వల్ల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటల్లో లారీ ట్యాంకర్‌తో సహా పదిమంది వరకూ వర్కర్స్ గాయపడ్డారు. వారిని వెంటనే అంబులెన్స్‌లో విజయనగరం తిరుమల ఆసుపత్రికి తరలించారు. ట్యాంకర్ నుండి మంటలు బారీగా వ్యాపించడంతో పక్కనే ఉన్న ఆమోనియం సిలెండర్ రబ్బర్‌కేప్ కరిగిపోయి అమోనియం గ్యాస్ లీకైంది. దీంతో అమోనియం గ్యాస్ పీల్చిన కొంత మంది అక్కడకక్కడే పడిపోయారు. వారిని వెంటనే అంబులెన్స్‌లో పూసపాటిరేగ, సుందరపేట పిహెచ్‌సిలకు తరలించారు. అమోనియం గ్యాస్ గ్రీన్ జోన్‌లోకి రావడంతో సుమారుగా మరో 40 మంది దాకా అమోనియం గ్యాస్ పీల్చి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వారం దరిని సమీపంలోని చోడమ్మ అగ్రహారంలో ఏర్పాటు చేసిన రీహెబిటేషన్ కేంద్రానికి తరలించారు. పూసపాటిరేగ పిహెచ్‌సిలో వైద్యులు రాజేష్ వర్మ క్షతగాత్రులకు చికిత్సలు చేశారు. క్షేమంగా ఉండడంతో వారిని ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం గురువారం రసాయనిక విపత్తుపై మాక్ డ్రిల్ జరుగుతోందన్నారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో సాధారణంగా

గాయపడిన కార్మికునితో మాట్లాడుతున్న వైద్యులు

ఇలాంటి విపత్తులు వస్తే ఎలా వారిని రక్షించుకోగలమన్నదానిపై మాక్ డ్రిల్ చేసామన్నారు. అన్ని డిపార్ట్‌మెంటులు కలసి చేసామని ఈ డ్రిల్ వల్ల అధికార్లుతో పాటు, కార్మికులకు, యాజమాన్యాలకు అవగాహన వస్తుందని చెప్పారు. ఈ మాక్ డ్రిల్‌లో జిల్లా ఇన్స్‌పెక్టర్స్ ఆఫ్ ఫ్యాక్టరీ జివివిఎస్ నారాయణ, జిల్లా ఫైర్ అధికారి రామ్ ప్రకాశ్, డిఎంఅండ్‌హెచ్‌ఒ బాస్కరావు, తహశీల్దార్ ప్రవళిక, ఎస్ఐ సన్యాసినాయుడు, ఇఒపిఆర్‌డి డి. శ్రీనువాసరావు మైలాన్ ప్లాంట్ హెడ్ గురవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- డెంకాడ

పేదల అభ్యున్నతే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం 1963 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం వైయస్ఆర్ చేయూత 4వ విడతలో భాగంగా 3,837 మంది లబ్ధిదారులకు గాను సుమారు రూ7.26కోట్ల చెక్‌ను పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ సౌజన్యంతో గొర్లె పెంపకం దారులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపగడపకూ సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల, డెంకాడ ఎంపిపిలు అంబళ్ల సుధారాణి, బంటుపల్లి వెంకటవాసుదేవరావు, జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మీ, పూసపాటిరేగ వైసిపి అధ్యక్షులు పతివాడ అప్పులనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీ రాములనాయుడు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మాన్యాల కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, రాష్ట్ర డైరెక్టర్లు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.


పట్టాను అందిస్తున్న ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

గంట్యాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపిపి పీరుబండి హైమావతి చేతులు మీదుగా పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా 146 మందికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వరి నరసింహమూర్తి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ భవాని, వైసిపి నాయకులు నారాయణ మూర్తి రాజు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి- మెంటాడ

'మాకు ప్రాణ రక్షణ కల్పించి మా భూములు మాకు ఇప్పించాలి' అని ఆండ్ర పోలీసు స్టేషన్, తహశీల్దార్‌కు గిరిజన, దళిత నిరుపేదలు గురువారం ఫిర్యాదు చేశారు. తాత ముత్తాతలు నుండి సాగు చేసుకుంటూ ఫలసాయం పొందుతూ జీవనం సాగిస్తున్న గిరిజనులను పదేళ్ల నుంచి పెత్తందార్లు భయభ్రాంతులకు గురి చేస్తూ నీలగిరి చెట్లు పెంపకం చేపట్టారన్నారు. తమ తాత తండ్రుల పేరుమీదవున్న 144,145,146,147,148,149,150,151,152,153,154,155,156,157,158,159,160,161,130 సర్వే నెంబర్లలో సుమారు 200 ఎకరాలు మహమ్మద్ అముముల్లా అనే భూస్వామి ఆక్రమణకు పాల్పడ్డారన్నారు. నీలగిరి మొక్కలు ఫలసాయంను అమ్మకం చేపట్టిన మహమ్మద్ అముముల్లా కలపను తీసుకు వెళ్లకుండా అడ్డుకున్నామన్నారు. అడ్డుకున్న వ్యక్తులను బెదిరించి, భయభ్రాంతులకు గురి చేయడంతో ఆండ్ర పోలీసు స్టేషన్ ఆవరణలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాకోటి రాములు అధ్వర్యంలో బైఠాయించి నిరసన తెలియజేశామన్నారు. అనంతరం మండల

పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ గిరిజనులను బెదిరిస్తున్న మహమ్మద్ అముముల్లాను చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన, దళితుల నిరుపేదలకు న్యాయపరమైన లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టి భూస్వామి నుంచి ప్రాణ రక్షణ కల్పించి, వారి భూములు వారికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెమ్మ కళావతి, సవరవిల్లి గంగమ్మ, దేశాయి లక్ష్మీ, మండపర్తి పైడిరాజు, నమ్మి లక్ష్మణ, బంగారి సింహాచలం, సవరవిల్లి రాములమ్మ పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల భిక్షాటన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు గురువారం 36వ రోజు తమ నిరసనలో భాగంగా బిక్షాటన చేశారు. మిమ్స్ యాజమాన్యం జనవరి నెల పనిచేసిన కాలానికి జీతం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ నిరశన శిబిరం నుంచి రామతీర్థం జంక్షన్ వరకు బిక్షాటన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం చట్టం ప్రకారం పని చేసిన కాలానికి జీతం 7వ తేది లోపు వెయ్యాల్సి ఉన్నప్పటికీ వేయకపోవడం దుర్మార్గమన్నారు. 36 రోజులుగా రోడ్డు ఎక్కి తమ నిరసనను వివిధ రూపాలలో తెలియజేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం మొండి వైఖరి వీడి ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయి 7 డిఎలను వెంటనే ఇవ్వాలని, జనవరి జీతం అకౌంట్‌లో వెయ్యాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వేతన ఒప్పందం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అప్పలనాయుడు, రామకృష్ణ, బంగారు నాయుడు, మూర్తి, గౌరి, వరలక్ష్మి, నరిసింగ్, నాగభూషణం, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ వద్ద బిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

అసమర్థ పాలనతో సర్వనాశనం: కోండ్రు

ప్రజాశక్తి- రాజాం, రేగిడి

జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందని మాజీ మంత్రి, టిడిపి, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. రేగిడి మండలం సంకిలి వైసిపికి చెందిన 40 కుటుంబాలు, బూరాడ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, రాజాం 4వ వార్డుకు చెందిన కుమరాపు నీలకంఠం నాయుడు కుటుంబాలు గురువారం టిడిపిలో చేరాయి. వీరికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కోండ్రు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ అని, సిపిఎస్ రద్దు అని, విద్యుత్ ఛార్జీలు పెంచనని, మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తానని చెప్పిన జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్న పకీరు నాయుడు, కర్రి రమణ, గంగు కృష్ణారావు, టి ఆనంద ప్రభాకరరావు, టీ త్రినాధరావు, వాగులపల్లి నాగభూషణరావు, గురవాన రమేష్, గురవాన నారాయణరావు తదితరు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి ఉప సర్పంచ్

బొబ్బిలి: తెర్లాం మండలంలోని పాములవలస పంచాయతీ వైసిపి ఉప సర్పంచ్ పి.లక్ష్మి గురువారం ఆ పార్టీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. లక్ష్మితో పాటు మరో 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరందరికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు పని చేయాలని బేబినాయన, రాజా కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎన్. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం మండలంలోని పాతరేగ గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసిపిని వీడి గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపిలో చేరిన వారికి కోటలో నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా కండువాలు వేసి ఆహ్వానించారు. టిడిపి-జనసేన కూటమి విజయానికి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం మండల నాయకులు ఎం.తిరుపతినాయుడు, పి.నాగరాజు, రామకృష్ణ, పాల్గొన్నారు.

కుతంత్రాలను తిప్పి కొట్టాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కుతంత్రాలను తిప్పి కొట్టేందుకు కార్మిక లోకం కదం తొక్కాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. గురువారం మండలంలో పలు ప్రాంతాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించి వేతన కార్మికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ కనుసన్నలలో గత ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి తగిన నిదులు కేటాయించ లేదన్నారు. రూ.3లక్షల కోట్లు అవసరం కాగా కేవలం రూ.80 వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చే పనే అన్నారు. ఆధార్ అనుసంధానం పేరిట లక్షలాది కుటుంబాలను ఉపాధి పనులకు దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాఫ్ట్‌వేర్ నిబంధనల్లో మార్పులు చేసి రెండు పూటలా పనులు చేసేలా చేశారన్నారు. ప్రతీ వ్యక్తికి 200 పనిదినాలు కల్పించి రూ. 600 వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నిధులు కేటాయించి గిట్టుబాటు వేతనం, అలవెన్సులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రాడ్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలి: సిఐటియు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ యాజమాన్యం రిటైర్డ్ కార్మికులకు పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద రామారావు గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు గత ఆరు నెలలుగా చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల నుంచి యాజమాన్యం అప్పుగా తీసుకున్న 5,10,18రూపాయలు ఇంత వరకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా గ్రాడ్యుటీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. 2023లో పిఎఫ్, ఇఎస్ఐ కూడా యాజమాన్యం సంబంధిత అధికార్లకు ఐదు నెలలుగా చెల్లించలేదన్నారు. దీని ఫలితంగా రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన పిఎఫ్ బకాయిలు, పింఛన్ సౌకర్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ ఆదినారాయణ, కె. వెంకట్, ప్రకాష్, కె. తాతారావు పాల్గొన్నారు